నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, గురువారం 19 సెప్టెంబర్ 2024 | ADILABAD NIRMAL

ప్రైవేట్ దవాఖానలు నిబంధనలు పాటించాలి

ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 18 : ప్రైవేట్ దవాఖానలు నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి రాజేందర్ అన్నారు. నిర్మల్ పట్టణంలో బుధవారం పలు ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2010 నియమ నిబంధనలు 2022 ప్రకారం ఆసుపత్రులను నిర్వహించి సేవలందించాలన్నారు. ప్రతి ఆసుపత్రిలో సేవల రుసుములను తెలిపే చార్ట్‌ను ప్రదర్శించాలని, దానికి అనుగుణంగా రుసుం తీసుకోవాలన్నారు. అన్ని ఆసుపత్రుల్లో సేవలందించే వైద్యుల పేర్లు, వారి అర్హతలు తెలిపే విధంగా పత్రాలను ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మీడియా విస్తరణ అధికారి రవీందర్ పాల్గొన్నారు.

21 వరకు అభ్యంతరాలు అందజేయాలి

మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, సెప్టెంబర్ 18 : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 13వ తేదీన ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితాపై ఈనెల 21వ తేదీ వరకు అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్నట్లయితే గ్రామ పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు అందజేయవచ్చని జిల్లా ఎన్నికల అథారిటీ అధికారి, కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామస్థాయిలో ముసాయిదా జాబితాను స్థానిక గ్రామ పంచాయతీ, మండలాభివృద్ధి అధికారి కార్యాలయాల్లో ఈనెల 13న ముసాయిదా జాబితా ప్రకటించడం జరిగిందని, ఆ జాబితాలపై అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉంటే ఈనెల 21లోగా సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలని తెలిపారు. ఆ అభ్యంతరాలను పరిశీలించి ఈనెల 26లోగా పరిష్కరించడం జరుగుతుందని, తుది ఫొటో ఎలక్ట్రోరల్ జాబితాను ఈనెల 28న ఆయా గ్రామ పంచాయతీ, మండలాభివృద్ధి అధికారి కార్యాలయాల్లో ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సీఈవో జితేందర్‌రెడ్డి, డీపీవో శ్రీలత పాల్గొన్నారు.

అర్ధరాత్రి కూడా విధులు నిర్వహిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

ప్రశాంతంగా నిమజ్జనం

- సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రశాంతంగా వేడుకలు
- ఊపిరి పీల్చుకున్న పోలీసు, ఇతర శాఖల అధికారులు
- ఎస్పీ జానకి షర్మిలకు అభినందనలు తెలిపిన ఐజీ
- అందరి సహకారంతోనే విజయవంతం : ఎస్పీ

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 18 : జిల్లాలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. ప్రధాన పట్టణాలైన నిర్మల్, భైంసా, ఖానాపూర్ ప్రాంతాల్లో దాదాపు 2,080 వినాయకులను ప్రతిష్టించారు. 11 రోజులపాటు పూజించి ఐదు, ఏడు, తొమ్మిది, పదకొండో రోజుల్లో బైబై గణేశా అంటూ నిమజ్జనం చేశారు. ఈ మూడు చోట్ల దాదాపు 1000 మంది పోలీసులు విధులు నిర్వహించారు. ఇందులో ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్, రిజర్వ్ పోలీసులు ఉన్నారు. కాగా.. ఉత్సవాలు ప్రశాంతంగా కొనసాగేందుకు ఎస్పీ జానకి షర్మిల మందు జాగ్రత్తలు తీసుకున్నారు.

తొలిసారిగా మహిళా ఐపీఎస్ చేతుల మీదుగా ఉత్సవాలు

నిర్మల్ జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఓ మహిళా ఐపీఎస్ అధికారి అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో వినాయక ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించి శెభాష్ అనిపించుకున్నారు. ఎస్పీతో మహిళలు సరదాగా సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు. భైంసాలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసినందుకు ఎస్పీ జానకి షర్మిలకు ఐజీ ఫోన్ చేసి అభినందించారు. కాగా.. జిల్లా ప్రజలు, ఉత్సవ సమితి సభ్యులు, మండపాల నిర్వాహకులు, అయా శాఖల అధికారులందరి సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేశామని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు.

సోయా కొనుగోలుకు చర్యలు

- రేపు అధికారుల సమావేశం
- 71,226 ఎకరాల్లో సాగు
- 4,27,356 క్వింటాళ్ల దిగుబడి అంచనా
- పూర్తిస్థాయి కొనుగోళ్ల తో ప్రయోజనం

ఇంద్రవెల్లి మండలంలో సాగవుతున్న సోయా

ఆదిలాబాద్, సెప్టెంబర్ 18(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో సోయాబిన్ కొనుగోళ్లకు అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా రేపు అడిషనల్ కలెక్టర్‌తో వివిధ శాఖల అధికారులు సమావేశం కానున్నారు. జిల్లాలో రైతులు వానకాలంలో 71,226 ఎకరాల్లో సోయా వేశారు. వాతావరణం, వర్షాలు అనుకూలించడంతో దిగుబడి ఆశాజనకంగా ఉంది. ఎకరాకు 6 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి. 4,27,356 క్వింటాళ్ల దిగుబడి అంచనా వేయగా.. ఈ మేరకు ఏర్పాట్లు చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా వారం రోజుల్లో పంట కోతలు ప్రారంభంకానుండగా.. అధికారులు కొనుగోళ్లకు ప్రణాళికలు తయారు చేశారు. అడిషనల్ కలెక్టర్‌తో జరిగే సమావేశంలో వ్యవసాయశాఖ, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, తూనికలు, కొలతల శాఖల అధికారులు పాల్గొంటారు. కొనుగోళ్లు ఎప్పుడూ ప్రారంభించాలనే విషయంతోపాటు రైతులకు ఇబ్బందులు కలుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తారు. కొనుగోలు చేసే తేదీని నిర్ణయిస్తారు.

పూర్తిస్థాయి కొనుగోళ్ల తో ప్రయోజనం

వ్యవసాయ శాఖ మార్కెట్ యార్డుల్లో సోయా కొనుగోళ్లు జరగనుండగా.. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తారు. వ్యవసాయ సహకార సంఘాలు రైతుల వద్ద నుంచి పంటను సేకరిస్తాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది సోయాను క్వింటాలుకు రూ.4,892 మద్దతు ధర ప్రకటించగా.. ప్రైవేట్ వ్యాపారులు క్వింటాలుకు రూ.4,650 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. కనీస మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో సోయా ధర తక్కువ ఉండడంతో రైతులు మార్క్‌ఫెడ్‌లో విక్రయించే అవకాశాలున్నాయి. ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసే ధర కంటే మద్దతు ధర ఎక్కువగా ఉండడంతో రైతులు భారీగా పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తారు. అన్నదాతలకు ఇబ్బంది కలుగకుండా చూడడంతోపాటు పూర్తిస్థాయిలో పంట కొనుగోళ్లు జరిగితేనే రైతులకు ప్రయోజనం ఉంటుందని రైతు సంఘాల నాయకులు అంటున్నారు. నామమాత్రంగా కాకుండా చివరి గింజ వరకు పంటను సేకరించారించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని కోరుతున్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక జేఏసీ నాయకులు

టెండర్లు రద్దు చేయకుంటే సెక్రటేరియట్‌ను ముట్టడిస్తాం

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్

ఎదులాపురం, సెప్టెంబర్ 18 : తెలంగాణ భవన నిర్మాణం, ఇతర నిర్మాణ కార్మికుల బోర్డు అమలు చేస్తున్న పథకాలను సంక్షేమ బోర్డు ద్వారా కాకుండా ప్రైవేట్ పరం చేయడానికి వేస్తున్న టెండర్లను రద్దు చేయకుంటే సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట భవన నిర్మాణ కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర పిలుపు మేరకు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ.. వెల్ఫేర్ బోర్డు పటిష్ట పర్చాలని సంతకాల సేకరణ చేపట్టి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం రూపంలో అందజేస్తామన్నారు. సెప్టెంబర్ 23వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వెల్ఫేర్ బోర్డు రక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలలో భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల స్వామి, జిల్లా నాయకులు ఆర్.సురేందర్, సురేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం సీఐటీయూ జిల్లా కో-కన్వీనర్ దుమాల అశోక్, నాయకులు విఠల్, బాగు వండ్లు, శంకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ నారాయణ, జిల్లా నాయకులు సుభాష్, నర్సింగ్, దేవిదాస్, మారుతి, సహాయ కార్యదర్శి ఉమ్రే నితిన్ పాల్గొన్నారు.

టీజీఎన్పీడీసీఎల్ యాప్‌లో విద్యుత్ సేవలు

- 19 ఫీచర్లతో పలు ఉపయోగాలు
- వినియోగించుకోవాలంటున్న అధికారులు



ఆదిలాబాద్, సెప్టెంబర్ 18(నమస్తే తెలంగాణ) : తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(టీజీఎన్పీడీసీఎల్) యాప్‌కు పలు అంశాలతో అందుబాటులోకి వచ్చినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. 19 ఫీచర్లతో ఈ యాప్ ఉంటుందని ఆదిలాబాద్ ఎన్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జయవంత్‌రావు చౌహాన్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు.

రిపోర్ట్ ఆన్ ఇన్సిడెంట్ : విద్యుత్ శాఖకు సంబంధించి ఎక్కడ ఏదైనా ఘటన జరిగినా యాప్‌లోని జీపీఎస్ లోకేషన్ ద్వారా వినియోగదారుడు ఫోన్‌లో ఫొటో తీసి పంపవచ్చు. దీంతో ఇందుకు సంబంధించిన రిపోర్టు నేరుగా సంబంధింత అధికారికి చేరుతుంది. వారు స్పందించి పరిష్కారం చేస్తారు.

కన్జూమర్ గ్రీవెన్స్, న్యూ కంప్లైంట్స్ : వినియోగదారుడు సమస్యలను నేరుగా ఇందులో తెలియజేయవచ్చు. మీటరు నంబరు, సమస్యల వివరాలు నమోదు చేస్తే అధికారులు పరిష్కరిస్తారు. కంప్లైంట్ స్టేటస్‌ను చూసే అవకాశం ఉండగా, పరిష్కారం విషయంలో సంతృప్తి చెందకపోతే తిరిగి ఫిర్యాదు చేయవచ్చు.

సెల్ఫ్ రీడింగ్ : వినియోగదారులు తమ మీటరుకు సెల్ఫ్ రీడింగ్ తీసుకుని పంపించవచ్చు. దీని ప్రకారం బిల్లులు జారీ అవుతాయి.

పే బిల్స్ : సర్వీస్ నంబరు నమోదు చేసుకుని ప్రతినెలా తమ విద్యుత్ బిల్లులను ఇందులో చెల్లించవచ్చు. **బిల్ హిస్టరీ :** తాము చెల్లించిన బిల్లుల వివరాలను తెలుసుకోవచ్చు.

ఆన్‌లైన్ పేమెంట్ హిస్టరీ : ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన బిల్లుల వివరాలను చూసుకునే అవకాశం ఉంది. **లింక్ ఆధార్, మొబైల్ :** వినియోగదారులు తమ ఆధార్, మొబైల్ నంబర్లను లింక్ చేసుకోవచ్చు. దీంతో ప్రతినెలా బిల్లులకు సంబంధించిన సమాచారం మెస్సేజ్ వస్తుంది.

డొమెస్టిక్ బిల్ క్యాలిక్యులేటర్ : వినియోగాదారులు నెల వారి విద్యుత్ వినియోగానికి సంబంధించిన మీటర్ రీడింగ్ వివరాలు పొందుపరిస్తే బిల్లు వివరాలను చూసుకునే అవకాశం ఉంది. **న్యూ కనెక్షన్ :** విద్యుత్ కనెక్షన్ కావాలనుకునే వారు ఎలా దరఖాస్తు చేసుకోవాలనే వివరాలు ఉంటాయి. **పేరు, లోడ్ మార్పు :** విద్యుత్ మీటర్ పేరు మార్చడానికి ఏమి చేయాలనే వివరాలు, లోడ్ వివరాలు ఉంటాయి. దీని ప్రకారం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. **పవర్ కంజప్షన్ గైడ్‌లైన్స్ :** విద్యుత్ ఉపకరణాలు, దీనికి ఎంత విద్యుత్ వినియోగం అవుతుందనే వివరాలు ఉంటాయి. **టారిఫ్ డిటెయిల్స్ :** విద్యుత్ వినియోగ చార్జీలు క్యాటగిరీలవారీగా ఉంటాయి. **ఎనర్జీ సేవింగ్ టిప్స్ :** విద్యుత్‌ను పొదుపు చేయడానికి తీసుకోవాల్సిన సూచనలు ఉంటాయి. **సెఫ్టీ టిప్స్ :** విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఉంటాయి. **ఫీడ్ బ్యాక్ :** సంస్థ అందిస్తున్న సేవల గురించి వినియోగదారులు తమ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. **మై అకౌంట్ :** విద్యుత్ వినియోగదారుల పూర్తి వివరాలు ఉంటాయి. **కాంటాక్ట్ యాజ్ :** ఇందులో 24/7 పనిచేసే టోల్ ఫ్రీ నంబర్లు ఉంటాయి. 1912, 18004250028 నంబర్లకు ఫోన్ చేసి సమస్యను తెలియజేయవచ్చు.

వీటితోపాటు వినియోగదారుల పరిధిలోని అధికారుల వివరాలు, బిల్లులకు సంబంధించిన సమాచారం వివరాలను యాప్‌లో తెలుసుకోవచ్చని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

యాప్ సేవలను వినియోగించుకోవాలి..

టీజీఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం పలు ఫీచర్లతో కూడిన యాప్‌ను తయారు చేసింది. ఈ యాప్ ద్వారా వినియోగదారులకు పలు సేవలు అందుతాయి. విద్యుత్ సమస్యలు, బిల్లుల చెల్లింపులు, కొత్త కనెక్షన్లు, అధికారుల కోసం కార్యాలయాలు చుట్టూ తిరిగే అవసరం లేకుండా వినియోగదారులకు టీజీఎన్పీడీసీఎల్ యాప్ ఉపయోగపడుతుంది. వినియోగదారులు ఈ యాప్‌ను వినియోగించుకోవాలి. **- జయవంత్‌రావు చౌహాన్, ఎస్ఈ, ఎన్పీడీసీఎల్, ఆదిలాబాద్**

మండపం వద్ద మైనార్టీ యువకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

కుల, మతాలకు అతీతంగా కలిసి ఉండాలి

బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

మైనార్టీ యువకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నేరడిగొండ, సెప్టెంబర్ 18 : ప్రతి పండుగను కులాలు, మతాలకు అతీతంగా జరుపుకుంటే ఎలాంటి అవరోధాలు ఉండవని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని భగత్‌సింగ్ గణేశ్ మండపం వద్ద మైనార్టీ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మైనార్టీ యువకులు గణేశ్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషించదగిన విషయమన్నారు. తామంతా ఐకమత్యంతో అన్నదమ్ముల లాగా అన్ని పండుగలను జరుపుకుంటామని మైనార్టీ యూత్ సభ్యులు పేర్కొన్నారు. ముందుగా ఎమ్మెల్యే మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నానక్‌సింగ్, రాథోడ్ సురేందర్, ప్రతాప్‌సింగ్, లింబాజీ, సాయిరాం, మైనార్టీ యూత్ సభ్యులు సద్దాం పాల్గొన్నారు.

ఉడుమును పట్టి.. ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టి..

వైరల్ కావడంతో నిర్మల్ డీఎఫ్‌వో కార్యాలయంలో ఫిర్యాదు

- వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు
- షేర్, లైకుల కోసం చూస్తే కటకటాలు లెక్కించాల్సి వస్తున్నది

వేటకు గురైన మానిటరింగ్ బల్లి (ఇన్‌స్టాగ్రామ్ ఫొటో)

కడెం, సెప్టెంబర్ 18 : వన్యప్రాణులను వేటాడిన కేసులో ఒకరికి శిక్ష పడినట్లు కడెం అటవీ సంరక్షణ అధికారి గీత తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. దస్తురాబాద్ మండలంలోని ఆకొండపేట గ్రామానికి చెందిన మాడ్గుల రాధాకృష్ణ ఈ నెల కడెం రేంజ్ అటవీ సమీపంలో మానిటరింగ్ బల్లులు(ఉడుములు) వేట సాగించాడు. దీనికి సంబంధించిన వీడియోను ఆగస్టు 4వ తేదీన రాధాకృష్ణ.లవర్.ఆర్‌కే3 అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీలో పెట్టి వైరల్ చేశాడు. దీనిపై కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన ఎదులాపురం గౌతమ్, పీసీఏ అధికారి, స్టే ఎనిమల్ ఫౌండేషన్ ఇండియా(ఎన్‌జీవో) అనే వ్యక్తి ఈ నెల 17వ తేదీన నిర్మల్ జిల్లాకేంద్రంలోని డీఎఫ్‌వో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు అధికారులు బుధవారం రాధాకృష్ణను పట్టుకుని వీడియో గురించి విచారణ చేపట్టారు. తాను వృత్తి రీత్యా జేసీబీ డ్రైవర్‌నని, పాములు పట్టడం వంటివి చేస్తుంటానని, వీడియోను షేర్ చేసి లైక్‌ల కోసం ఈ పనిని చేసినట్లు చెప్పినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

భోజనశాలను పరిశీలిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

మెరుగైన విద్యను అందించాలి

ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్ రూరల్, సెప్టెంబర్ 18 : ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని హస్నాపూర్‌లో గల ఆదర్శ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం, విద్య, వసతుల గురించి తెలుసుకున్నారు. అదేవిధంగా వసతి గృహాల పరిసరాలు, తరగతి గదులు, విద్యార్థుల, ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టరును పరిశీలించారు. అనంతరం పీవో మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం చేయకూడదని అన్నారు. ప్రతి విద్యార్థి సరళంగా చదవడం, రాయడం రావాలని అన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలని అన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్, సెప్టెంబర్ 18 : బోస్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో అందించిన ట్రెయినింగ్‌ని సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత్ దేకో స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాం ద్వారా 34 మంది విద్యార్థులకు ట్రెయినింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లో ప్రాథమిక స్థాయి నుంచి విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. బోస్ ఫెలోషిప్ వలంటీర్లు జాబ్ ఓరియెంటెడ్ స్కిల్స్ నేర్చుకోవాలన్నారు. ఇందుకు గాను ఐటీడీఏ తరపున సర్టిఫికెట్ అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్, వైస్ ప్రిన్సిపాల్ సాయి ప్రసాద్, పీడీ అనిత, అధ్యాపకులు నర్సింగ్‌రావు, రాజశేఖర్, కిషన్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

రీజినల్ సైనిక్ వెల్ఫేర్ ప్రారంభం

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, సెప్టెంబర్ 18 : రీజినల్ సైనిక్ వెల్ఫేర్ కార్యాలయాన్ని బుధవారం కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్‌లో రూ.8 లక్షల విలువ గల భవనాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో రీజనల్ సైనిక్ వెల్ఫేర్ బోర్డు మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌లో సైనిక్ వెల్ఫేర్ కార్యక్రమాలైన ఐడీ కార్డు జారీ చేసే విధానం, హౌస్ ప్లాట్స్, అగ్రికల్చర్ ల్యాండ్, క్యాంటీన్ ఏర్పాటు కోసం వైద్య సదుపాయాలు కల్పించడం కోసం స్వయం ఉపాధి రుణాల కోసం లీడ్ బ్యాంకు మేనేజర్ ద్వారా పరిశ్రమల శాఖ ద్వారా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాలు మ్యారేజ్, చదువు కోసం సంబంధించిన విషయాలను చర్చించారు. ఆర్మీ వితంతువైన సిరికొండకు చెందిన మహిళా ఎక్స్ సర్వీస్‌మన్ వెల్కర్ పూజకు రూ.2 లక్షల చెక్కును కలెక్టర్ చేతల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్, జిల్లా యువజన క్రీడా, సైనిక్ సంక్షేమాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పౌర సంబంధాల అధికారి బి.తిరుమల, జిల్లా ఉపాధి కల్పన అధికారి మిల్కా, మాజీ సైనిక సంఘం అధ్యక్షులు శంకర్ దాస్, ఉపాధ్యక్షులు అశోక్, సెక్రెటరీ మోహన్, క్యాషియర్ దేవన్న, మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యులు భాస్కర్ రెడ్డి, రవి, డీబీ చారి, సత్తయ్య, మధు పాల్గొన్నారు.